


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 138 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం సోమవారం 30 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 138 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM MON 30 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## వినూత్న రీతిలో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం...

- మంగళగిరిలో ఘనంగా జరిగిన టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం
- ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- నూతన పంథాలో వేడుకలు.. వేదికపైకి సామాన్య కార్యకర్తలు
- కార్యకర్తే పార్టీకి అధినేత అనే నినాదానికి పెద్దపీట వేసిన అధిష్టానం
- పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తూ సభ నిర్వహణ





**పెన్ పవర్ డెస్క్:** తెలుగు దేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈసారి వినూత్న పంథాలో, కార్యకర్తలకే అగ్రతాంబూలం ఇస్తూ పార్టీ అధిష్టానం ఈ సభను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరై

- మిగతా2లో

# ఆ బాధ్యతను లోకేశ్ కు అప్పగిస్తున్నా

- టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం
- మంగళగిరిలో ఘనంగా వేడుకలు
- కార్యకర్తలను దూరంగా పెట్టే నేతలను తాను దూరంగా పెడతానన్న చంద్రబాబు
- పార్టీ కోసం కష్టపడే వారికే ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తామని హామీ
- కష్టపడే వారిని గుర్తించే బాధ్యతను నారా లోకేశ్ కు అప్పగించిన సీఎం



**పెన్ పవర్ డెస్క్:**తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాది అని, వారిని నిర్లక్ష్యం చేసే నాయకులను తాను ఉపేక్షించబోనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. "కార్యకర్తలను దూరంగా ఉంచే నేతలను నేను దూరంగా ఉంచుతా. కార్యకర్తలను ఇబ్బంది పెట్టే నాయకులు మాకు అవసరం లేదు" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ గుర్తుపై గెలిచి ఎమ్మెల్యేలు, మంత్రులు అయిన ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. ఈసారి వినూత్నంగా వేదికపై కార్యకర్తలను కూర్చోబెట్టి, సీనియర్ నేతలు సభికుల్లో కూర్చోవడం ద్వారా 'కార్యకర్తే అధినేత' అనే నినాదానికి ఆచరణాత్మక రూపాన్ని ఇచ్చారు. ఎవరు బాగా పనిచేస్తే వారే ప్రజాప్రతినిధులు అవుతారు

భవిష్యత్తులో పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే పదవులు వస్తాయని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. "రాబోయే రోజుల్లో డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా 50 శాతం సీట్లు పెరగనున్నాయి. 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయి. పార్టీ కోసం ఎవరు బాగా పనిచేస్తే వారే ప్రజాప్రతినిధులవుతారు. క్రమశిక్షణతో పనిచేసి పార్టీని బలోపేతం చేయండి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను, నేతలను గుర్తించే కీలక బాధ్యతను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కు అప్పగిస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు వ్యక్తిగత ప్రవర్తన నుంచి ప్రతి అంశంలోనూ పార్టీ బ్రాండ్‌ను నిలిపేలా ఆదర్శంగా ఉండాలని సూచించారు.

**చరిత్ర, వర్తమానం, భవిష్యత్ టీడీపీదే**

తెలుగుదేశం పార్టీ ప్రస్థానాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. "టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రతి అడుగూ సంచలనమే, ప్రతి నిర్ణయమూ ప్రజాక్షేమమే. నాడు ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా బర్తరఫ్ చేస్తే, ప్రజలే రోడ్లపైకి వచ్చి ఉద్యమించి తిరిగి అధికారాన్ని కట్టబెట్టారు. 40 ఏళ్ల క్రితం టీడీపీ తెచ్చిన రూ.2కే కిలో బియ్యం పథకమే నేటి జాతీయ ఆహార భద్రతా చట్టానికి స్ఫూర్తి. మహిళలకు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు వంటివి మనమే దేశానికి పరిచయం చేశాం.

- మిగతా2లో




## గల్ఫ్ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు

- భారత్ తీరం వైపు వస్తున్న రెండు భారీ ఎల్పీజీ నౌకలు
- సుమారు 94,000 టన్నుల ఎల్పీజీతో ప్రయాణం
- గల్ఫ్ ప్రాంతంలో భారత నావికులు, నౌకలు క్షేమంగా ఉన్నారని కేంద్రం ప్రకటన
- ఇప్పటివరకు 942 మంది భారత నావికుల తరలింపు
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్

- మిగతా2లో





## తమిళనాడు ఎన్నికలు: యూత్ కోసం విజయ్ స్పెషల్ అజెండా

- తమిళ యువత కోసం 10 సూత్రాల ఎజెండాను ప్రకటించిన నటుడు విజయ్
- అధికారంలోకి వస్తే అమలు చేస్తామని, ఇది తన గ్యారంటీ అని స్పష్టీకరణ
- డ్రగ్స్ రహిత తమిళనాడు, విద్య కోసం రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణం
- ప్రభుత్వ ఉద్యోగాలకు వార్షిక క్యాలెండర్, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం
- స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు ప్రోత్సాహకాలు

- మిగతా2లో

## కార్యకర్తలకు చంద్రబాబు, లోకేశ్ ఆత్మీయ విందు, ఘనసత్కారం...

- టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం
- సీనియర్ కార్యకర్తలకు నివాసంలో ఆత్మీయ విందు ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్
- కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న అధినేత
- పార్టీ కోసం చేసిన త్యాగాలు మరువలేనివన్న ముఖ్యమంత్రి
- కొత్త బట్టలు, శాలువాలతో కార్యకర్తలకు సత్కారం




- మిగతా2లో

## గల్ఫ్ దేశాలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు.. కష్టకాలంలో అండగా నిలిచాయని ప్రశంస

- పశ్చిమాసియా సంక్షోభంలో భారతీయులను ఆదుకున్న గల్ఫ్ దేశాలు
- విమాన సర్వీసులు నిలిచినప్పుడు తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు
- బలమైన దౌత్య సంబంధాల వల్లే ఇది సాధ్యమైందన్న ప్రధాని మోదీ

- మిగతా2లో




## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి... గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

- అక్రమ మైనింగ్ ఆరోపణలపై మంత్రి పొంగులేటిని తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్
- గన్ పార్క్ వద్ద ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్, హరీశ్ రావు నిరసన
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై సభా సంఘంతో విచారణకు పట్టు
- మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపణ
- ప్రభుత్వం స్పందించకుంటే గవర్నర్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరిక




**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వచ్చిన అవినీతి, అక్రమ మైనింగ్ ఆరోపణల నేపథ్యంలో, ఆయనను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం నాడు అసెంబ్లీ సమీపంలోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అనంతరం ఈ అంశాన్ని శాసనసభలో కూడా ప్రస్తావించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు ఇతర ఎమ్మెల్యేలతో కలిసి ఈ నిరసనలో పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి కుటుంబానికి

- మిగతా2లో



## ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల అమరావతి రైతులకు న్యాయం జరగదు

- అమరావతి రైతులకు న్యాయం చేయాలంటూ విజయసాయిరెడ్డి ట్వీట్
- అమరావతి రైతులకు ప్లాట్లతో పాటు అదనపు పరిహారం ఇవ్వాలని డిమాండ్
- 11 ఏళ్లలో ఒక్కరైనా ఇల్లు కట్టుకోగలిగారా అని ప్రశ్న
- పేదలకు గతంలో ఇచ్చిన 50 వేల ఇళ్ల పట్టాలు పునరుద్ధరించాలని స్పష్టీకరణ
- భూములిచ్చిన వారికే న్యాయం జరగకుంటే రాజధాని ఎవరికని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసా యిరెడ్డి ఏపీలోని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు


- మిగతా2లో

## ఆకివీడు రామాలయ పునర్నిర్మాణంపై రఘురామ కీలక ప్రకటన

- ఆకివీడులోని పురాతన రామాలయం పునర్నిర్మాణం
- కృష్ణశిలతో నిర్మిస్తామని ప్రకటించిన రఘురామకృష్ణరాజు
- 8 శతాబ్దాలు చెక్కుచెదరకుండా నిర్మాణం ఉంటుందని వెల్లడి
- ప్రముఖ స్థపతి ఈమని శివనాగిరెడ్డి నేతృత్వంలో పనులు
- ఇటీవల ఇదే ఆలయం వద్ద రఘురామపై దాడి యత్నం

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కీలక ప్రకటన చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలోని పురాతన రామాలయాన్ని పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. ఇటీవల శ్రీరామనవమి రోజున తనపై దాడికి

- మిగతా2లో



## పాకిస్థాన్ ఇప్పుడు 'గౌరవనీయ మధ్యవర్తి'... ఇది కేంద్ర వైఫల్యమే



- పాకిస్థాన్ ఇప్పుడు 'గౌరవనీయ మధ్యవర్తి'... ఇది కేంద్ర వైఫల్యమే: జైరాం రమేశ్
- పాక్‌కు అమెరికా ఆమోదం.. మోదీ సర్కార్ విదేశాంగ వైఫల్యమేనన్న కాంగ్రెస్
- పాకిస్థాన్ 'మధ్యవర్తి'గా మారిందంటూ కేంద్రంపై జైరాం రమేశ్ విమర్శ
- కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టిన బీజేపీ
- జైశంకర్ వ్యాఖ్యలకు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ మద్దతు
- 'దళారీ' పదం చుట్టూ తిరుగుతున్న రాజకీయ వివాదం

- మిగతా2లో




# కిమ్ టార్గెట్ అమెరికా

ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ అమెరికాను లక్ష్యంగా చేసుకునే క్షిపణుల సామర్థ్యాన్ని స్వయంగా పరీక్షించారు. అధిక సామర్థ్యంతో పనిచేసే ఘన ఇంధన ఇంజిన్ భూమిపై చేసిన పరీక్షను స్వయంగా వీక్షించారు. ఇది దేశ వ్యూహాత్మక సైనిక సామర్థ్యాన్ని పెంచే కీలక అభివృద్ధి అని ఆయన ప్రశంసించినట్లు అధికార వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ ఆదివారం వెల్లడించింది. ఈ పరీక్ష అమెరికా ప్రధాన భూభాగాన్ని చేరగల క్షిపణుల సామర్థ్యాన్ని పెంచి, ఆయుధ సంపత్తిని విస్తరించాలనే కిమ్ సంకల్పాన్ని సూచిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఉత్తర కొరియా పార్లమెంట్‌లో కిమ్ చేసిన ప్రసంగంలో దేశాన్ని శాశ్వత అణు శక్తిగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. మధ్యప్రాచ్య యుద్ధాన్ని ప్రస్తావిస్తూ అమెరికాపై 'రాష్ట్ర ఉగ్రవాదం, దాడి ధోరణి' ఆరోపణలు చేశారు. కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ నివేదిక ప్రకారం కార్బన్ ఫైబర్ పదార్థంతో అప్‌గ్రేడ్ చేసిన ఈ కొత్త ఇంజిన్ గరిష్ఠంగా ఒత్తిడి 2,500 కిలోటన్నులుగా నమోదైంది. సెప్టెంబరులో జరిగిన ఇలాంటి ఘన ఇంధన ఇంజిన్ పరీక్షలో ఇది సుమారు 1,971 కిలోటన్నులుగా ఉండేది.

ఇంజిన్ శక్తిని పెంచడం వెనుక ఒకే క్షిపణిలో అనేక అణు వార్‌హెడ్‌లను అమర్చి, అమెరికా రక్షణ వ్యవస్థలను దాటిచెప్పే అవకాశాన్ని పెంచాలనే యత్నం ఉన్నట్లు పరిశీలకులు చెబుతున్నారు. పరీక్ష ఎప్పుడు, ఎక్కడ జరిగింది అనే వివరాలు కెసీఎన్‌ఏ వెల్లడించలేదు. ఐదేళ్ల సైనిక విస్తరణ ప్రణాళికలో భాగంగా ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపింది. ఈ ప్రణాళికలో "వ్యూహాత్మక దాడి సామర్థ్యాల" మెరుగుదల ప్రధాన లక్ష్యమని పేర్కొంది. దీనర్థం అమెరికా ఖండాన్ని లక్ష్యంగా చేసుకున్న అణు సామర్థ్యంతో కూడిన అంతర్మహాద్వీప క్షిపణుల అభివృద్ధి అని అర్థమవుతోంది. కిమ్ తాజా ఇంజిన్ పరీక్ష దేశ వ్యూహాత్మక సైనిక బలాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్తుందని వ్యాఖ్యానించినట్లు కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఇటీవలి సంవత్సరాల్లో ఉత్తర కొరియా పలు రకాల అంతర్మహాద్వీప క్షిపణులను ప్రయోగించింది. ఘన ఇంధన క్షిపణులు ముందస్తు గుర్తింపును కష్టతరం చేస్తాయి. పాత ద్రవ ఇంధన క్షిపణులను ప్రయోగానికి ముందు ఇంధనం నింపాల్సి రావడం వల్ల అవి ఎక్కువసేపు సిద్ధంగా ఉండలేవు.

**ట్రంప్ తో చర్చల తర్వాత వేగం...**

కొంతమంది విదేశీ నిపుణుల అభిప్రాయం ప్రకారం వాతావరణంలో తిరిగి ప్రవేశించే సమయంలో వార్‌హెడ్‌లు ఎదుర్కొనే తీవ్ర పరిస్థితులను తట్టుకునే సాంకేతిక సామర్థ్యం ఇంకా ఉత్తర కొరియాకు పూర్తిగా సిద్ధం కాలేదని అంటున్నారు. అయితే మరికొందరు దీన్ని ఖండిస్తూ, ఎన్నేళ్లుగా అణు, క్షిపణి కార్యక్రమాలు కొనసాగుతున్నందున ఈ సవాళ్లను అధిగమించి ఉండవచ్చని భావిస్తున్నారు. 2019లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో కిమ్ జరిపిన చర్చలు విఫలమైన తర్వాత ఉత్తర కొరియా అణు ఆయుధ విస్తరణపై మరింత దృష్టి పెట్టింది. ఫిబ్రవరిలో జరిగిన వర్కర్స్ పార్టీ సమావేశంలో ట్రంప్‌తో సంభాషణలకు తలుపులు తెరిచే అవకాశం ఉందని కిమ్ చెప్పినా, ముందుగా అణు నిరాయుధీకరణను షరతుగా పెట్టవద్దని వాషింగ్టన్‌కు సూచించారు.

## ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల అమరావతి రైతులకు న్యాయం జరగదు

- మొదటి పేజి తరువాయి

గతంలో ఇస్తామన్న నివాస, వాణిజ్య ప్లాట్లతో పాటు, 2013 భూసేకరణ చట్టం ప్రకారం అదనంగా నష్టపరిహారం కూడా చెల్లించాలని కోరారు. ఈ మేరకు ట్వీట్ చేశారు."ఒక రైతుగా అడుగుతున్నా. నా అమరావతి రైతు సోదరుల కోసం అధికారపార్టీని అడుగుతున్నా. 2015లో ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతుల్లో ఎవరైనా వారికి కేటాయించిన ప్లాట్‌లో ఇల్లు కట్టుకోగలిగారా? వారిలో ఏ ఒక్క రైతు అయినా వారికి ఇచ్చిన కమర్షియల్ స్థలంలో ఒక షాపింగ్ కాంప్లెక్స్ కట్టగలిగారా? ఈ 11 ఏళ్ళ కాలంలో వారికి కేవలం ఏడాదికి ఇంత అని నామమాత్రంగా డబ్బు ఇవ్వటం వల్ల కలిగిన లాభం ఏమిటి? రైతుల త్యాగాలు వెల కట్టలేనివి అని నిన్న శాసన సభలో పలువురు సభ్యులు చెప్పారు. ఈ ఎమోషనల్ డైలాగుల వల్ల రైతులకు న్యాయం జరగదు. భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికి అయినా ఇంతకు ముందు మీరు ఇస్తాం అన్న ఇళ్ల స్థలం, కమర్షియల్ స్థలం మాత్రమే కాకుండా, అదనంగా ఫెయిర్ కాంపిన్సేషన్ చట్టం 2013 ప్రకారం నష్ట పరిహారం ఇవ్వండి. అసైన్డ్ భూముల విషయంలో ఒరిజినల్ హక్కుదారులకే నష్ట పరిహారం ఇవ్వండి. అలాగే మరో విషయాన్ని కూడా అడుగుతున్నా, నిరుపేదలకు గత ప్రభుత్వం కేటాయించిన 50 వేల ఇళ్ల పట్టాలను మీరెందుకు రద్దు చేశారు? ఆ ప్లాట్లను ఆ నిరుపేదలకే తిరిగి ఇవ్వండి. ఒక వైపు లక్షల కోట్లతో రాజధాని కడతాం అంటున్నారు. మీరు కట్టండి కానీ, ఆ భూములు ఇచ్చిన రైతులకే న్యాయం చేయనట్టయితే, ఆ నిర్మించే భారీ భవనాల పునాదులు ఎవరి భూముల్లో నిర్మిస్తున్నారో వారికే సంతృప్తి, సంతోషం కలిగించనట్టయితే ఏమిటి ప్రయోజనం? అలా నిర్మించే రాజధాని వల్ల ఏ ధనికులకి, బూర్జువాలకి లాభం కలుగుతుందో ప్రజలు కూడా ఆలోచన చేస్తారని మీరు కూడా గమనించండి" అంటూ విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# ఆ బాధ్యతను లోకేశ్ కు అప్పగిస్తున్నా

- మొదటి పేజి తరువాయి

డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశాం. బీసీలకు రాజ్యాధికారం, ఎస్సీలకు వర్గీకరణ, ఎస్టీలు, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేశాం" అని వివరించారు.

**టీడీపీని ఫినిష్ చేస్తామన్నారు... వాళ్లే ఫినిష్ అయ్యారు**

పార్టీ ప్రస్థానంలో ఎన్నో సంక్షోభాలను, సవాళ్లను ఎదుర్కొన్నామని చంద్రబాబు అన్నారు. "టీడీపీని ఫినిష్ చేస్తామన్న వారే ఫినిష్ అయ్యారు. ఎంతోమంది కార్యకర్తలు త్యాగాలు చేశారు, ప్రాణాలు కోల్పోయారు. నాపై అలిపిరిలో హత్యాయత్నం జరిగింది. 2019-24 మధ్య కాలంలో నన్ను కూడా అక్రమంగా జైల్లో పెట్టారు. గత ప్రభుత్వ విధ్వంసంపై లోకేశ్ యువగళం పాదయాత్రను అడుగడుగునా అడ్డుకున్నారు. అయినా కార్యకర్తల అండతోనే ముందుకు సాగాం. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం అంతా కార్యకర్తల త్యాగాల ఫలితమే" అని భావోద్వేగంగా ప్రసంగించారు. చంద్రయ్య అనే కార్యకర్త త్యాగాన్ని గుర్తుపెట్టుకుని, ఆయన కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చామని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**'సూపర్ సిక్స్'తో సంక్షేమ పాలన**

2024 ఎన్నికల్లో బీజేపీ-జనసేనతో కలిసి చారిత్రక విజయం సాధించామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. దేశంలోనే ఎవరూ ఇవ్వని విధంగా రూ.4,000 సామాజిక పెన్షన్ ఇస్తున్నాం. తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాలను అమలు చేస్తున్నాం. డీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టాం. తాజాగా 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. చెప్పినట్టుగానే 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా పరిశ్రమలను ఆకర్షిస్తున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, నిలబెట్టుకున్నాం. ఈ ఏడాది కూడా పెంచం, భవిష్యత్తులోనూ పెంచబోం" అని స్పష్టం చేశారు.

**ఒకే రాజధాని.. అభివృద్ధి ప్రణాళిక**

రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికపై చంద్రబాబు స్పష్టతనిచ్చారు. "పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. అమరావతిలో గతంలో ప్రారంభించిన పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం. అమరావతి దేవతల రాజధాని కాబట్టి కొందరు రాక్షసులకు ఇష్టం లేదు. ఇక మూడు ముక్కలాట లేదు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అదే అమరావతి" అని పునరుద్ఘాటించారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ, వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**వేదికపై కార్యకర్తలు.. సరికొత్త పంథా**

ఈసారి ఆవిర్భావ దినోత్సవ సభలో ఒక ప్రత్యేకత చోటుచేసుకుంది. 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ, పార్టీ కోసం కష్టపడిన 19 మంది సామాన్య కార్యకర్తలను వేదికపై ఆసీనులను చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు, సీనియర్ నాయకులు సభికుల మధ్య కూర్చున్నారు. సభా నిర్వహణ బాధ్యతలను యువ నాయకురాలు కావలి గ్రీష్మకు అప్పగించారు. ఈ సందర్భంగా అండమాన్ నికోబార్ దీవుల నుంచి టీడీపీ నేతలు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అంతకుముందు, చంద్రబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు. పార్టీ బలోపేతానికి పునరంకితమవుతామని కార్యకర్తలతో కలిసి ఆయన ప్రతిజ్ఞ చేశారు.

## కార్యకర్తలకు చంద్రబాబు, లోకేశ్ ఆత్మీయ విందు, ఘనసత్కారం...

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్ తమ నివాసంలో పార్టీ సీనియర్ కార్యకర్తలకు ఆత్మీయ విందు ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి నిరంతరం సేవలందిస్తున్న సీనియర్లను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ విందుకు హాజరైన ప్రతి కార్యకర్త వద్దకు వెళ్లి వారి ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కార్యకర్తలు చేసిన పోరాటాలు, త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారి సేవలను ఆయన కొనియాడారు. తమను కుటుంబ సభ్యులుగా భావించి, స్వయంగా ఇంటికి ఆహ్వానించి విందు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. అధినేత చూపిన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, విందుకు హాజరైన కార్యకర్తలందరినీ చంద్రబాబు, లోకేశ్ కొత్త బట్టలు పెట్టి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## గల్ఫ్ దేశాలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు.. కష్టకాలంలో అండగా నిలిచాయని ప్రశంస

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు, వేలాది మంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కీలక కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు.

గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని ప్రధాని మోదీ వివరించారు. "కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అదేవిధంగా, గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

## పాకిస్థాన్ ఇప్పుడు 'గౌరవనీయ మధ్యవర్తి'... ఇది కేంద్ర వైఫల్యమే

ఒకప్పుడు ఏకాకిగా ఉన్న పాకిస్థాన్‌కు, పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో అమెరికా నుంచి కొత్తగా గౌరవం, మధ్యవర్తి హోదా లభించడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఇది ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విదేశాంగ విధాన వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించింది.

కాంగ్రెస్ సీనియర్ నేత, పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ... గతంలో క్లింటన్, బుష్, ఒబామా, బైడెన్ వంటి అమెరికా అధ్యక్షులు పాకిస్థాన్‌తో కఠినంగా వ్యవహరించారని గుర్తుచేశారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత అంతర్జాతీయంగా ఏకాకిగా మారిన పాక్‌కు ఇప్పుడు ట్రంప్ హయాంలో కొత్త ఆదరణ లభించిందన్నారు. "భారత్ సైనికపరంగా 'ఆపరేషన్ సిందూర్'లో విజయం సాధించినా, దాన్ని దౌత్యపరంగా సద్వినియోగం చేసుకోవడంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. విదేశాంగ మంత్రి జైశంకర్ మాటల్లో చెప్పాలంటే పాకిస్థాన్ ఇప్పుడు 'గౌరవనీయ మధ్యవర్తి'గా మారింది. ఇది మోదీ ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనం" అని జైరాం రమేశ్ విమర్శించారు.

కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ గట్టిగా తిప్పికొట్టింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ దేశ ఆత్మగౌరవాన్ని కాపాడుతూ తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారని, కానీ కాంగ్రెస్ నిరంతరం దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను 'దళారీ' అని పిలిచినందుకు విదేశాంగ మంత్రి జైశంకర్‌ను ఆయన అభినందించారు.

ఇటీవల మార్చి 25న జరిగిన అఖిలపక్ష సమావేశంలో విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ "భారత్ ఎప్పటికీ 'దళారీ' దేశంగా ఉండబోదు" అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఇదే 'దళారీ' పదం చుట్టూ కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

## తమిళనాడు ఎన్నికలు: యూత్ కోసం విజయ్ స్పెషల్ అజెండా

తమిళనాడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమైన నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్, యువతనే లక్ష్యంగా చేసుకుని కీలకమైన అడుగులు వేస్తున్నారు. ఆదివారం నుంగంబాక్కంలో జరిగిన ఓ కార్యక్రమంలో, రాష్ట్ర యువత భవిష్యత్తును మార్చేందుకు ఉద్దేశించిన 10 పాయింట్ల సమగ్ర యూత్ అజెండాను ఆయన ఆవిష్కరించారు. తాము అధికారంలోకి వస్తే ఈ హామీలను కచ్చితంగా అమలు చేస్తామని, ఇవి కేవలం వాగ్దానాలు కావని, ఒక 'గ్యారెంటీ' అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక హామీ కాదు, ఇది టీవీకే గ్యారెంటీ... మీ సోదరుడు విజయ్ గ్యారెంటీ" అని యువతతో నేరుగా సామాజిక ఒప్పందం చేసుకుంటున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యపై స్పందిస్తూ, విద్య, ఉపాధి, పాలన సంస్కరణలే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**విజయ్ ప్రకటించిన ముఖ్య హామీలు ఇవే:**

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల కోసం 'తమిళనాడు రిక్రూట్‌మెంట్ అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్' తీసుకొస్తామని విజయ్ తెలిపారు. దీని ద్వారా ప్రతి ఏటా ఉద్యోగాల భర్తీకి ఒక స్థిరమైన క్యాలెండర్ విడుదల చేసి, ఏడాదిలోగా నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు, 25 ఏళ్లు పైబడిన పట్టభద్రులకు నెలకు రూ. 4,000, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసినవారికి రూ. 2,500 చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారు.

ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో 'ఎడ్యుకేషన్ గ్యారెంటీ స్కీమ్' కింద రూ. 20 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందిస్తామన్నారు. అలాగే, ఏటా ఐదు లక్షల మంది యువతకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసి, గ్రాడ్యుయేట్లకు రూ. 10,000, డిప్లొమా హోల్డర్లకు రూ. 8,000 స్టైఫండ్ ఇస్తామని చెప్పారు.

యువతలో వ్యవస్థాపకతను ప్రోత్సహించేందుకు రూ. 25 లక్షల వరకు రహిత రుణాలు అందిస్తామన్నారు. అలాగే, కనీసం 75% స్థానికులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీలను ప్రోత్సహించడానికి "తమిళ్ ఎంప్లాయ్‌మెంట్ క్రెడిట్ సిస్టమ్" ప్రవేశపెడతామని తెలిపారు. "మత్తుపదార్థాల రహిత తమిళనాడు"ను నిర్మించడం తమ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని విజయ్ స్పష్టం చేశారు. ఇందుకోసం కఠినమైన చట్టాలు తీసుకురావడంతో పాటు, పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ-డ్రగ్ క్లబ్స్ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా స్థానిక సంస్థల్లో 'చీఫ్ మినిస్టర్స్ పీపుల్ సర్వీస్ అసోసియేట్స్'గా యువతను నియమించి, వారికి నెలకు రూ. 18,000 గౌరవ వేతనం ఇస్తామన్నారు.

విధాన రూపకల్పనలో యువత భాగస్వామ్యం కోసం 'యూత్ అడ్వైజరీ కౌన్సిల్' ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వీటితో పాటు, 1.5 లక్షల మంది యువతకు 'క్రియేటర్-ప్రెన్యూర్' కార్యక్రమం కింద మూలధనం, రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు వంటివి తన అజెండాలో ఉన్నాయని విజయ్ వివరించారు. ఈ ప్రకటనలన్నీ తమిళనాడు యువత భవిష్యత్తును సురక్షితం చేయడానికేనని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ యువత కేంద్రంగానే రాజకీయాలు చేస్తుందని విజయ్ స్పష్టం చేశారు.

## గల్ఫ్ ప్రాంతాన్ని సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు

గల్ఫ్ ప్రాంతం నుంచి రెండు భారీ ఎల్పీజీ క్యారియర్లు సురక్షితంగా భారత్ తీరం వైపు ప్రయాణిస్తున్నాయి. బీడబ్ల్యూ టీవైఆర్, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ అనే ఈ నౌకల్లో సుమారు 94,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, బీడబ్ల్యూ టీవైఆర్ నౌక మార్చి 31న ముంబైకి, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ నౌక ఏప్రిల్ 1న న్యూ మంగళూరుకు చేరుకోనున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నౌకలు, నావికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, గత 24 గంటల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 18 భారత నౌకలు, 485 మంది భారత నావికులు ఉన్నట్లు తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్), నౌకల యజమానులు, భారత రాయబార కార్యాలయాలతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ 24ఐ7 పనిచేస్తోందని, ఇప్పటివరకు 942 మంది నావికులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయపడిందని పేర్కొంది. గత 24 గంటల్లో నలుగురు నావికులను తరలించిన్నట్టు తెలిపింది. భారత్‌లోని అన్ని ఓడరేవుల్లో కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని, ఎక్కడా రద్దీ లేదని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. విదేశాంగ శాఖ, ఇతర సముద్రయాన భాగస్వాములతో కలిసి నావికుల సంక్షేమం, నిరంతరాయ సముద్ర కార్యకలాపాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపింది. గల్ఫ్, పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, సహాయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, 24ఐ7 హెల్ప్‌లైన్‌లు పనిచేస్తున్నాయని విదేశాంగ శాఖ వివరించింది.

## ఆకివీడు రామాలయ పునర్నిర్మాణంపై రఘురామ కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

యత్నం జరిగిన ప్రదేశంలోనే ఈ ఆలయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్నట్లు వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ మేరకు ఆయన ఆదివారం నాడు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ప్రముఖ హిందూ సంస్థల ఆధ్వర్యంలో, సుప్రసిద్ధ స్థపతి (శిల్పకళా నిపుణుడు) డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గారి నేతృత్వంలో ఈ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. శిల్పకళ, వాస్తు, ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా పూర్తిగా కృష్ణ శిలతో ఆలయాన్ని నిర్మిస్తామని, కనీసం 8 శతాబ్దాల పాటు చెక్కుచెదరని విధంగా ఈ నిర్మాణం ఉంటుందని రఘురామ వివరించారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఇదే ఆలయం వద్ద రఘురామకృష్ణరాజుపై కొందరు దాడికి యత్నించిన ఘటన కలకలం రేపడం తెలిసిందే.

## వినూత్న రీతిలో టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం...

- మొదటి పేజి తరువాయి

భారీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఆవిర్భావ సభను "కార్యకర్తే అధినేత" అనే నినాదాన్ని ప్రతిబింబించేలా నిర్వహించడం విశేషం. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన 19 మంది సామాన్య కార్యకర్తలను వేదికపై కూర్చోబెట్టి గౌరవించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వంటి సీనియర్ నేతలు సభికుల మధ్యలో ఆశీనులయ్యారు. గత ప్రభుత్వ హయాంలో వేధింపులు ఎదుర్కొన్న వారికి, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వారికి ఈ వేదికపై ప్రాధాన్యం ఇచ్చారు. సభా నిర్వహణ బాధ్యతలను యువ ఎమ్మెల్సీ కావలి గ్రీష్మకు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ కార్యకర్తలు పార్టీతో తమకున్న అనుబంధాన్ని, తాము చేసిన సేవను భావోద్వేగంతో పంచుకున్నారు. తమ లాంటి సామాన్య కార్యకర్తలను గౌరవించే ఏకైక పార్టీ టీడీపీనేనని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి... గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

- మొదటి పేజి తరువాయి

చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ, దీనిపై సభా సంఘం లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేఖ రాశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆధారాలతోనే హరీశ్ రావు ఈ కుంభకోణాన్ని బయటపెట్టారని అన్నారు. ఇతర కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, మంత్రి కుటుంబ సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కంపెనీతో మంత్రి భార్య, కుమారుడు, సోదరుడికి ప్రత్యక్ష సంబంధాలున్నాయని, 2020-22 మధ్య పొంగులేటి ఛైర్మన్‌గా ఉన్నారని కేటీఆర్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రి పొంగులేటిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో సీఎంకు కూడా ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళతామని హెచ్చరించారు.

# మండలంలో ఘనంగా తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం



**వై రామవరం, పెన్ పవర్, మార్చ్ 29**: మండలంలో తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వై రామవరం సెంటర్లో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేశారు.

మండల కేంద్రంలో రామాలయం ఎదురుగా ఉన్న తెలుగుదేశం పార్టీ దిమ్మ దగ్గర మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి.కాంతారెడ్డి జెండాను ఆవిష్కరించారు. మండల తెలుగుదేశం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టె,పాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం మాజీ అధ్యక్షుడు పల్లాల రమణారెడ్డి, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మి, మాజీ సర్పంచులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# డివిజన్ లో నత్తనడకన ఆస్తి పన్ను వసూళ్ళు

- 9 మండలాల్లో రూ. 71 కోట్లు డిమాండ్ .. వసూళ్ళు రూ 54 కోట్లు ..
- వసూళ్ళల్లో ప్రథమ, చివరి స్థానాల్లో బిక్కవోలు, రాజానగరం మండలాలు
- పన్ను చెల్లింపు దారుల బాధ్యతారాహిత్యం, పంచాయతీ కార్యదర్శుల,సిబ్బంది నిర్లక్ష్యం
- ఆస్తి పన్ను బకాయిల్లోను పెద్దలదే పెద్ద వాటా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:**ఆస్తి పన్నులు చెల్లించండి గ్రామాల అభివృద్ధికి తోడ్పడండని, రాష్ట్ర ప్రభుత్వం తోపాటు,జిల్లా స్థాయి పంచాయతీ , రెవిన్యూ శాఖల ఉన్నతాధికారుల వరకు ఎన్ని విజ్ఞప్తులు చేసిన, క్షేత్రస్థాయిలో సంబంధిత పంచాయతీల అధికారులు, సిబ్బంది వందలసార్లు ఇంటింటికి తిరిగి పన్నులు చెల్లించండని వినతులు చేసిన, మౌలిక వసతులు బంద్ చేస్తామని , ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించినా ఆస్తి పన్ను చెల్లింపు దారుల తీరు “దున్నపోతు మీద వర్షం కురిసినట్టు“ గా ఉన్న పరిస్థితి తూర్పుగోదావరి జిల్లాలో, ముఖ్యంగా “ రాజమహేంద్రవరం“ డివిజన్లో నెలకొందని తెలుస్తోంది. 20 25 బి 2026 ఆర్థిక సంవత్సరం మరో 3 రోజుల్లో ముగుస్తుంది. అయినప్పటికీ రాజమహేంద్రవరం డివిజన్లో ని 9 మండలాల్లో ఆస్తి పన్ను డిమాండ్ సుమారు రూ. 71 కోట్ల రూపాయలు ఉండగా, ఆది వారం వరకు 80 శాతం మేర సుమారు రూ.55 కోట్ల రూపాయలు వరకు వసుళ్ళు అయ్యాయని తెలుస్తోంది. దీన్ని బట్టి గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల మెరుగుదలకు పన్ను చెల్లింపు దారుల బాధ్యతారాహిత్యం,నిర్లక్ష్యం, ఉదాశీనతకు అర్థం పడుతుంది. ప్రభుత్వ పెద్దల నుంచి, జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది వరకు ఆస్తి పన్ను చెల్లింపులని ఎంతగా చైతన్య పరుస్తున్నప్పటికీ, చెల్లింపుల ప్రక్రియ ను ఆన్లైన్, మొబైల్, వాట్సాప్ గవర్నెన్స్ వంటి ఆధునిక విధానాలను ప్రజల వద్దకే తీసుకు వెళ్లినప్పటికీ ప్రజల్లో అవగాహన రాకపోగా, బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని జిల్లా పంచాయతీ అధికారి తో సహా,క్షేత్రస్థాయి పంచాయతీ అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. మరోవైపు ప్రభుత్వం నూతనం గా ప్రవేశ పెట్టిన స్వర్ణ పంచాయతీ యప్ (జి పి ఎస్) విధానాన్ని అమలు పరచడం లో పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గత విధానం లో సిబ్బంది చేతికి నగదు వచ్చేదని, ఇష్టానుసారంగా సొంతానికి వినియోగించుకునే వారనే విమర్శలు ఆరోపణలు వచ్చేవి. ఆమేరకు ప్రభుత్వ ఖజానాకు గండి పడేది. ప్రభుత్వం నూతనం గా ప్రవేశ పెట్టిన స్వర్ణ పంచాయతీ యప్ ను ప్రజల్లోకి ఉద్దేశ్య పూర్వకంగానే తీసుకువె ళ్ళడం లేదనే వాదనలు వినిపిస్తు న్నాయి. ఇందుకు ఉదాహరణగా రాజమహేంద్రవరం డివిజన్ లోని 9 మండలాల్లోని ఆస్తి పన్ను డిమాండు, చెల్లింపుల నిష్పత్తిని నిశితంగా పరిశీలించినట్లయితే చెల్లింపు దారుల బాధ్యత రాహిత్యం, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టం అవుతుంది. ఈ 9 మండలాల్లో 146 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.



**మొదటి, చివరి స్థానాల్లో బిక్కవోలు, రాజమండ్రి రూరల్ మండలాలు...**

డివిజన్ లోని బిక్కవోలు మండలంలో ఆస్తి పన్ను డిమాండు రూ 3. 78 కోట్లు ,వసూళ్లు రూ. 3.43 కోట్లు,వసూళ్లు కావలసిన బకాయిలు రూ. 3.53 ఉంది. ఈ మండలం ఆస్తి పన్ను వసూళ్లలో 98.55 డివిజన్లో మొదటి స్థానంలో ఉంది. అనపర్తి మండలం లో ఆస్తి పన్ను డిమాండు రూ 4. 82 కోట్లు ఉండగా, వసూళ్లు అయ్యింది రూ. 4.55 కోట్ల కాగా, వసూళ్లు కావలసిన బ్యాలెన్స్ రూ 27 లక్షలు ఉంది. ఈ మండలం ఆస్తి పన్ను వసూళ్లలో 66.09 శాతంతో డివిజన్లో రెండవ స్థానంలో ఉంది. డివిజన్ లో రాజానగరం మండలంలో డిమాండు రూ 11.38 కోట్లు , వసూళ్లు రూ. 5.83 కోట్ల అయింది కాగా, వసూళ్లు కావలసిన బకాయలు రూ. 4.34 కోట్లు ఉన్నాయి. ఈ మండలం ఆస్తి పన్ను వసూళ్లలో 45.74 శాతంతో అట్టడుగు స్థానంలో రాజానగరం మండలం ఉందని తెలుస్తోంది.

దీని తర్వాత స్థానంలో రాజమండ్రి రూరల్ మండలం ఉంది. ఈ మండలం ఆస్తి పన్ను వసూళ్లలో 51.58 శాతంతో మండలంలో డిమాండు రూ.30.80 కోట్లు , వసూళ్లు రూ. 16.10 కోట్ల కాగా, వసూళ్లు కావలసిన బకాయలు రూ. 14.69 కోట్లు రావలసి ఉంది. ఈ మండలంలో పెద్ద, పెద్ద విద్యాసంస్థలు, నాయకులు ఉన్నారు. అంతే పెద్ద ఎత్తున బకాయలు చెల్లింపుల్లో ను పెద్దరికం పోషిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. రంగంపేట మండలంలో డిమాండు రూ.2.32 కోట్లు , వసూళ్లు రూ. 1.82 కోట్ల కాగా, వసూళ్లు కావలసిన బకాయలు రూ. 51.0 లక్షలు రావలసి ఉంది. ఆస్తి పన్ను వసూళ్లలో 75.25 శాతం వసూలు అయింది. డివిజన్ లోని కోరుకొండ మండలంలో డిమాండు రూ.2.63 కోట్లు , వసూళ్లు రూ. 2.09 కోట్ల కాగా, వసూళ్లు కావలసిన బకాయలు రూ. 54. 0 లక్షలు రావలసి ఉంది. ఆస్తి పన్ను వసూళ్లలో 84.15 శాతం వసూలు అయింది. సీతానగరం మండలంలో డిమాండు రూ.2.56 కోట్లు , వసూళ్లు రూ. 2.02 కోట్ల కాగా, వసూళ్లు కావలసిన బకాయలు రూ. 55.0 లక్షలు రావలసి ఉంది. ఆస్తి పన్ను వసూళ్లలో 90.92శాతం వసూలు అయింది. గోకవరం మండలంలో డిమాండు రూ.2.68 కోట్లు , వసూళ్లు రూ. 1.93 కోట్ల కాగా, వసూళ్లు కావలసిన బకాయలు రూ. 74.0 లక్షలు రావలసి ఉంది. ఆస్తి పన్ను వసూళ్లలో 84.48 శాతం వసూలు అయింది. కడియం మండలంలో డిమాండు సుమారు రూ.10.0 కోట్లు , వసూళ్లు రూ. 7.70 కోట్ల కాగా, వసూళ్లు కావలసిన బకాయలు రూ. 3. 40 కోట్లు రావలసి ఉంది. ఆస్తి పన్ను వసూళ్లలో 7.09 శాతం వసూలు అయింది. ఈ మండలం లో ఎన్నో పరిశ్రమలు , వాణిజ్య నర్సరీలు ఉన్నాయి. డివిజన్ మొత్తం మీద ఈ ఆర్థిక సంవత్సరంలో 146 గ్రామపంచాయతీలో ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను డిమాండు సుమారు రూ. 71 కోట్ల రూపాయలు కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మరో 3 రోజుల్లో ముగుస్తుతున్న నాటికి వసూళ్లు రూ.54 కోట్లు కావడం, ఇంకా రూ.27 కోట్ల రూపాయలు 24 శాతం పైబడి బకాయిలు పేరుకుపోవడం పట్ల ప్రజల్లో సొంత గ్రామాల అభివృద్ధి పట్ల బాధ్యతారాహిత్యం స్పష్టంగా కనిపిస్తోందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. గ్రామాల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత తో పాటు ప్రజల బాధ్యత కూడా ఎంతైనా ఉందని ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు అభిప్రాయ పడుతున్నాయి.

# ఆరోగ్యకర సమాజానికి ప్రభుత్వం ప్రాధాన్యత





- రూ.55 లక్షలతో గ్రామ ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన
- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి

**గంగవరం రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 29** : ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్ మిరియాల శిరీషాదేవి తెలిపారు. రంపచోడవరం మండల కేంద్రంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.55 లక్షల వ్యయంతో నిర్మించబడనున్న ఈ భవనాన్ని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ సలాది బాపిరాజు, సీతపల్లి దేవస్థానం చైర్మన్ కుంజం బాపన్న దొర, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, దేవీపట్నం మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల చంటి బాబు, ఎస్టీ విభాగం అధ్యక్షుడు పండా చెల్లన్న దొర, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, మాజీ సర్పంచ్ నిరంజనీదేవి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కోసు నాగన్న దొర తదితరులు పాల్గొన్నారు.

# వరదలపై ముందస్తు మమ్మర చర్యలు మూడు నెలల రేషన్ సిద్ధం



కలెక్టర్ దినేష్ కుమార్



**చింతూరు, పెన్ పవర్ మార్చి 29:**ఈ సంవత్సరం సంభవించే వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఆదివారం చింతూరులోని ఐటీడీఏ సమావేశపు హాలులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల ఇంజనీర్లు మరియు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరదలు ఎప్పుడైనా వచ్చినా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని ముందుగానే సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ముందుగానే నిల్వ ఉంచుతున్నామని తెలిపారు. అలాగే లాంచీలు, కంట్రీ బోట్లు, ఆయిల్ తదితర అవసరమైన సామగ్రిని కూడా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గతంలో వరదల సమయంలో చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, భద్రాచలం ప్రాంతంలో వరద హెచ్చరికలు వచ్చిన వెంటనే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల ఏర్పాటుపై వివరాలు సేకరించారు. అదేవిధంగా, పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలను వచ్చే ఏడాదిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీవో జనరల్ రామతులసి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆంజనేయులు, వై. వెంకటేశ్వర్లు, బాలకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, పిహెచ్ఓ ముత్తయ్య, సిడిపిఓ జయలక్ష్మి, ఏవో కే. సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మురళి, రత్నరాజు, డిఇలు సూర్యప్రకాశ్, ఆశ్రిత తదితరులు పాల్గొన్నారు.



# పోలవరం ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం: కలెక్టర్ దినేష్ కుమార్





**గంగవరం/ ఎటపాక, పెన్ పవర్ ,మార్చి 29:** పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలను ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఎటపాక మండలం పిచ్చుకలపాడు గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ & ఆర్ ప్యాకేజీని అర్హులైన వారికి వచ్చే ఏడాదిలోగా అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో త్రాగునీటి సరఫరా కోసం జల జీవన్ మిషన్ కింద రూ. 37 లక్షలు మంజూరై, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆరోగ్య సేవలు మెరుగుపరచడం, చెరువుల మరమ్మత్తులు, రోడ్లు, విద్యుత్ సదుపాయాలు, గృహాలు, పింఛన్లు, రేషన్ కార్డులు వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తూతిగచెరువు పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం చింతూరు మండలం ఏజీకోడేరు గ్రామంలో ముంపు బాధితులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. ల్యాండ్ టు ల్యాండ్ పునరావాసం, పింఛన్లు, రేషన్ కార్డులపై గ్రామస్తుల అభ్యర్థనలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ సహా వివిధ శాఖల అధికారులు ఏపీ ఓ జనరల్ రామ తులసి, తాసిల్దార్లు శ్రీనివాసరావు, హుస్సేన్, ఎంపీడీవోలు ఎస్. శ్రీనివాసరావు,విజయ దత్తు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి, సిడిపిఓ అరుణ, డాక్టర్ శ్రీదేవి, ఎంఈఓ, లక్ష్మీనారాయణ, సర్పంచ్ రాంబాబు,ఎంపీటీసీ జె. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## యధావిధిగా 'మీకోసం' రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు

- 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అర్జీలు స్వీకరణ
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 29:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను మార్చి 30న యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిలలో కూడా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. రంపచోడవరం పీఓ ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌కు ఆర్డీవోలు, తహశీల్దార్లు మరియు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తారని పేర్కొన్నారు.
ప్రజలు తమ ఫిర్యాదులను meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందని, అలాగే 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అర్జీలు సమర్పించడంతో పాటు వాటి స్థితి గురించి తెలుసుకోవచ్చని తెలిపారు. 'పీపుల్స్ ఫస్ట్' ధోరణిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ చెప్పారు. అదనంగా, పౌర సేవలను మరింత సులభతరం చేయడానికి 95523 00009 వాట్సాప్ నెంబర్ ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## గంగవరం మాజీ ఎంపీపీ తీగల ప్రభకు అరుదైన గౌరవం






**గంగవరం, పెన్ పవర్ మార్చి 29 :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలానికి చెందిన మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభకు 44వ తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అరుదైన గౌరవం దక్కింది. మంగళగిరిలోని టిడిపి పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసు సమక్షంలో వేదికను అలంకరించే అవకాశం ఆమెకు లభించింది. ఈ సందర్భంగా తీగల ప్రభ మాట్లాడుతూ, పార్టీ కష్టకాలంలో సీనియర్ కార్యకర్తగా పనిచేస్తూ "బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ" సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయిలో విస్తృతంగా పనిచేశానని తెలిపారు. ప్రజల నుంచి అధికంగా ఐవీఆర్ఎస్ కాల్స్ రావడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయడం వలన ఈ గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు. ఈ అరుదైన అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసు, ఎమ్మెల్యే శిరీషా దేవికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వడంలో తెలుగు దేశం పార్టీ ముందుంటుందని ఆమె అన్నారు. ఇదే సందర్భంలో తీగల ప్రభతో పాటు కష్టపడి పనిచేసిన మరో 19 మంది కార్యకర్తలను కూడా పార్టీ నాయకత్వం గుర్తించి శాలువాలు మరియు చిన్న ఎన్టీఆర్ విగ్రహాలతో సన్మానించింది.

## మార్కొండపాడు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం.





**ఉచిత మెగా వైద్య శిబిరనికి విశేష స్పందన**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 29.** మార్కొండపాడు గ్రామంలో రక్షభారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, స్మార్ట్ ఎమర్జెన్సీ హాస్పిటల్ మరియు గ్రామ వైద్యుడు అల్లాడి బాలాజీ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యుడు డా. ఎస్. శ్రీనివాసరావు పాల్గొని సుమారు 200 మందికి పైగా గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో భాగంగా ప్రజలకు బీపీ, షుగర్ మరియు ఈసీజీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా డా. శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. రక్షభారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా తమ హాస్పిటల్ నుండి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమం అనంతరం దారవరం వాస్తవ్యులు పి. నాగేశ్వరరావు, జి. శివకుమార్ మరియు రక్షభారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు డా. ఎస్. శ్రీనివాసరావు ని, హాస్పిటల్ సిబ్బంది ఎం. ఫణి గారిని మరియు నార్ని గణేష్ ని సత్కరించారు. ఈ శిబిరం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన వైద్యులు మరియు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలుగుదేశం పార్టీ 44 వసంతాలు పూర్తయిన వేళ సంబరాలు, రెపరెపలాడిన పార్టీ జెండా ...



**అడ్డతీగల, పెన్ పవర్, మార్చ్ 29:** అడ్డతీగల మండలంలో తెలుగుదేశం పార్టీ 44 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జర్త. వెంకటరమణారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు, మండల పార్టీ అధ్యక్షుడు జర్త. వెంకటరమణారెడ్డి జండా ఆవిష్కరణ చేయగా, పార్టీ స్థాపించిన నాటి నుండి ఉన్న సీనియర్ కార్యకర్తలు , మలగపాటి. ఆంజనేయులు రాజు, సత్తి. సత్తిరెడ్డి, దొమ్మేటి. అప్పారావు ముందుగా స్వర్గీయ నందమూరి. తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, జ్యోతి ప్రజ్వలన చేశారు, అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు, ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతకు కోసం, పేదవాడికి కూడు, గూడు,గుడ్డ, కల్పించాలని మన తెలుగుజాతి అభ్యున్నతి కోసం కృషి చేసిన మహా నాయకుడు అన్న నందమూరి .తారక రామారావు అని, అటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గాని, అభివృద్ధి సాధ్యం అయ్యిందంటే ఒక తెలుగుదేశం పార్టీ వలనేనని, తెలుగుదేశం పార్టీ తెలుగు జాతి కోసం, తెలుగు వారి ఖ్యాతిని వ్యాప్తి చెందాల చేసింది ఒక్క తెలుగుదేశం పార్టీ అని, తెలుగుదేశం పార్టీ, సిద్ధాంతాల కు క్రమశిక్షణకు మారుపేరని , అంతా గొప్ప పార్టీలో సేవకులుగా ఉన్నందుకు మనమందరం గర్వపడాలని, వక్తలు కొనియాడారు, ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు వంక. సతీష్ గౌడ్, ఎడ్ల. శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పుడిగి. ఆదిలక్ష్మి, సీనియర్ నాయకులు, వడ్డీ. రాంబాబు, శ్రీనివాస్ చౌదరి, మండల ఉపాధ్యక్షులు గొర్ల. సాగర్, యూనిట్ ఇంచార్జ్ కామన. కృష్ణమూర్తి, నాయకులు కేసనకుర్తి .ఆనందరావు, జారగడ్డ. మాణిక్యాలరావు,మేడిశెట్టి. శ్రీను , చెక్క. పండువీరలక్ష్మి, చెక్క. సత్యవతి, చెక్క. వరలక్ష్మి,చింతోజీ .బాపనమ్మ, బెహ్రోజు. మణిరాజు , బెహ్రోజు. వీరారెడ్డి, చదల. రామకృష్ణ, నర్సి. నాగమణి, నర్సి. వీర్రాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు అన్నం. అబ్బాయా రెడ్డి, చక్క వెంకటరమణ, గండేపల్లి. రామకృష్ణ, బీరా. బాలయోగి, సలమర్తి. వీరపురెడ్డి, సింగోజి. శ్రీను, బోండ్ల.ప్రభాకర్, బేలం సత్యనారాయణ,గ్రామ కమిటీ కార్యదర్శి సారపు రాజన్నా దొర, మరియు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కైకరంలో వేడుకగా కళ్యాణ సప్తహాలు



**పెన్ పవర్, ఉంగుటూరు, మార్చి 29** కైకరం గ్రామంలోని శ్రీ సుందర సీతారామస్వామి కళింగ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల కళ్యాణ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామరక్ష కవచ స్తోత్ర హోమం, సర్వకార్యసిద్ధి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.
ఈ హోమ కార్యక్రమం శ్రీరామచంద్ర పట్టాభిషేక మహోత్సవ భావంతో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రీయ పద్ధతిలో ఘనంగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు అఖండం భాస్కర సత్య వెంకట రామయ్య శర్మ హోమానికి సంబంధించిన అన్ని క్రతువులను భక్తులకు వివరిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హోమంలో భాగస్వాములై స్వామివారి అనుగ్రహం పొందారు. ఈ హోమం ద్వారా సుఖశాంతులు, ఐశ్వర్యం, కార్యసిద్ధి కలుగుతాయని వేదపండితులు పేర్కొన్నారు.
ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం ఘనవిజయంగా ముగిసిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# తెలుగుదేశం పార్టీ స్థాపనతో సంస్కరణలకు ఆద్యుడు ఎన్టీఆర్





- రిక్షా తొక్కి, రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ
- తెలుగుదేశం 44వ ఆవిర్భావ వేడుకలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:** స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చరిత్ర సృష్టించారని పార్టీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు, విద్యావంతులకు పెద్ద పీట వేసిన ఘనత ఎన్టీఆర్ దేనన్నారు. పార్టీ 44వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల రిక్షా తొక్కుతూ స్థానిక కోటిపల్లి బస్టాండ్ లోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గరకు చేరుకొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగడానికి ఆనాడు ఎన్టీఆర్ వేసిన పునాది కారణమన్నారు. పద్మావతి మహిళా విశ్వవి ద్యాలయం, తెలుగు విశ్వ విద్యాలయం స్థాపన, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్ కే చెల్లిందన్నారు. పేదలకు కిలో రెండు రూపాయల బియ్యం, పేదలకు పక్కా గృహాలు, జనతా వస్త్రాలు అందించారని ఎమ్మెల్యే గోరంట్ల గుర్తుచేసారు. తెలుగు భాషను , తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. ఎన్టీఆర్ పంథాను ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తూ, ఎన్నో ప్రజా సంక్షేమలను అమలు చేస్తున్నారని, ఆర్థికంగా ప్రగతిపథంలో చంద్రబాబు నడిపిస్తురన్నారు. యువనేత లోకేష్ రాష్ట అభివృద్ధి కి శ్రమిస్తున్నారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న 20 మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలను సత్కరించారు. రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, మజ్జి పద్మావతి, వెలుగుబంటి రఘురాం, మార్గాన్ని సత్యనారాయణ, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పండూరి అప్పారావు, దాలిపర్తి వేమన, నిమ్మలపూడి గోవింద్, నున్న కృష్ణ, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, , , గంగిన నాని, దండమూడి ప్రమీల, మద్దా మణి, పిల్ల తనూజ, గంగిన జాహ్నవి, శీలం గోవిందు, రొంపిచర్ల అంటోనీ, బూర దుర్గారావు, నిచ్చెన కోళ్ళ సత్తిబాబు, ఉండవల్లి బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు ప్రమాదంలో ఇద్దరు మృతి





**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మార్చి 29 ;** వేరు వేరు రోడ్డు ప్రమాదంలో జీలుగుమిల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గుమ్మాపు మనోహర ప్రసాద్( 45) ఈనెల 22వ తేదీన జంగారెడ్డిగూడెం లో శ్రీనివాస పురం రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనక నుండి ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో హ్యాండిల్ కడుపులో గుద్దుకుంది .ఏలూరు ఆశ్రమ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈయన చింతలపూడి మండలం సీతానగరం సబ్ స్టేషన్ లో లైన్మెన్ గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి పి రాజవరం వెళ్లే రహదారిలో రెండు ద్విచక్రాలు ఢీకొట్టడంతో మురారి రాజు( 50) తీవ్ర గాయాలు కావడంతో జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108 లో జంగారెడ్డిగూడెం ప్రాంతీయ వైద్యశాలకు తీసుకువెళుతున్నగా మార్గమధ్యంలో చనిపోయాడు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒకేరోజు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు కనిపించాయి.

## పౌర సదుపాయాలు కావాలంటే పన్నులు చెల్లించాలి



**పెన్ పవర్, ఏలూరు జిల్లా, ఉంగుటూరు, మార్చి 29:**ప్రజలు పౌర సదుపాయాలు, మౌలిక వసతులు పొందాలంటే కచ్చితంగా ఇంటి పన్నులు బకాయిలు లేకుండా సకాలంలో చెల్లించాలని బాదంపూడి పంచాయతీ అభివృద్ధి అధికారి కాకర్ల వెంకట గిరిధర్ అన్నారు.

ఆదివారం పంచాయతీ, సచివాలయం సిబ్బందితో కలిసి మొండి బకాయిదారుల ఇళ్లకు ఇంటింటికి వెళ్లి నోటీసులు అందించారు. గ్రామంలో వీధి లైట్లు, పారిశుధ్యం, తాగునీరు తదితర సదుపాయాలు సమర్ధవంతంగా అందించాలంటే ప్రజలు కూడా బాధ్యతగా పన్నులు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమేష్‌బాబు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# మోహనాపురంలో ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**గంగవరం, పెన్ పవర్ మార్చి 29 :** గంగవరం మండలం మోహనాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, నాయకులు మరియు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

కార్యక్రమంలో రైతు అధ్యక్షులు ఎం. శివరామ భూపతి దేవ్ మాట్లాడుతూ, టీడీపీ పార్టీ స్థాపన నుంచి ప్రజా సేవలో అంకిత భావంతో పనిచేస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషించిందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.మోహనాపురం టీడీపీ సీనియర్ కార్యకర్త బుర్రె రాంబాబు, బూత్ ఇంచార్జ్ బొగ్గుల సత్తిబాబు, పేసా సెక్రటరీ కోసం సూరిబాబు తదితరులు పాల్గొని పార్టీ విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా సూచించారుఈ వేడుకల్లో మోహనాపురం మరియు పంద్రపోలు పంచాయతీలకు చెందిన టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డాక్టర్ కొప్పుల నాగ మానసకు ఘన సన్మానం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలిగా నియమితులైన డాక్టర్ కొప్పుల నాగ మానస ను అమలాపురంలో ఘనంగా సన్మానం చేశారు.

గండువీది శ్రీ శేషశయన మైనర్స్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, ఆమెకు నియామక ఉత్తర్వులు అందిన సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణలో ఆమె విశేష సేవలందించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ పడాల శ్రీదేవి, పడాల నానాజీ, ఇతర ముఖ్య నేతలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# అన్నదేవరపేటలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం





**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 29:**తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో టీడీపీ యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జెండాని ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కాకర్ల సత్యేంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం అందిస్తున్న ప్రజా సంక్షేమపథకాలను గుర్తు చేస్తూ 50 మందికి తుప్పట్లు అందజేసి స్వీట్లు పంచటం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు కూచిపూడి హనుమంతరావు, కూచిపూడి లక్ష్మణ్ రావు లను పార్టికి వారు అందించిన సేవలకు గాను శాలువా కప్పి, వారిని సత్కారించటం జరిగింది.

ఈ కార్యక్రమంలో కూచిపూడి గణేష్, తొండేపు రమేష్, కూచిపూడి నరేంద్ర, రేగాడమిల్లి దుర్గ, లింగంపల్లి ప్రసాద్, కూచిపూడి జగన్, పెనుగొండ బంగారు బాబు, తాత సత్యనారాయణ, జిట్టిమోలు దుర్గారావు, బొట్టా ప్రసాద్, వీరమళ్ళ బంగారం, ఐనలా గోపి, పల్లె ప్రకాష్, పేరూరి రమణ, బొచ్చు శ్రీను, వెంకట్రావు, అనిల్, శ్రీనివాస్ కుమార్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# టీడీపీకి కార్యకర్తలే బలం వారే అధినేతలు



- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- వేడుకగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 29:** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని , వారే అధినేతలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయం వద్ద వేడుకలు జరిగాయి. టీడీపీ నగర శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాల రాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవన్ కుమార్ తదితరులతో కలిసి పార్టీ జెండాను ఎగురవేసి వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని వెలుగులోకి రాజకీయ శక్తి తెలుగుదేశం పార్టీ 44 సంవత్సరాల చరిత్ర, ఉద్యమం, ప్రజా శక్తి అన్నారు. సామాన్య ప్రజలకు, రైతులకు, పేదలకు, బలహీన వర్గాలకు రాజకీయాల్లో స్థానం కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీని అన్నారు. గ్రామీణ అభివృద్ధి, , మహిళా సాధికారత, సంక్షేమం అభివృద్ధి తో పార్టీ ముందుకు సాగుతోందన్నారు. గత 44 సంవత్సరాల టీడీపీ చరిత్రలో ఎన్నో సంస్కరణలు ప్రజలకు అందాయయన్నారు. ఉద్యోగాలు, పరిశ్రమలు రావాలి, యువతకు భవిష్యత్తు ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చగల శక్తి తెలుగుదేశం పార్టీకే ఉందన్నారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను ఆదరించడం తెలుగుదేశం పార్టీ సంస్కృత మన్నారు. పార్టీ బలోపేతానికి పని చేద్దామని, సమస్యలు పరిష్కరించానికి కృషి చేద్దామన్నారు. సోషల్ మీడియా, మై టీడీపీ యాప్ ఇతర తెలుగుదేశం పార్టీ యాప్‌ల్లో పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వం సంక్షేమ పథకాలను పోస్టింగ్‌లు చేస్తున్న పలువుర్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బాంధవుడు ఎన్టీఆర్. ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 29:**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు రైతుల సంక్షేమానికి బృహత్తర కార్యక్రమాలు చేపట్టి, రైతు బాంధవునిగా నిలిచారని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం పెద తాడేపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్టీఆర్ నిరంతరం తపించేవారని, ఆయన స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్న జనసేన, టిడిపి, బిజెపి పార్టీలు బలపడాలని, పరస్పరం స్నేహభావంతో మెలిగితేనే రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చగలమని అన్నారు. మూడు పార్టీల కలయికపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని అధికారంలోకి తెచ్చారని,వారి ఆశలు నెరవేర్చవలసిన బాధ్యత కూటమిలో మూడు పార్టీలపై ఉందని అన్నారు. అనవసర వివాదాలకు తావు లేకుండా, కూటమి ధర్మాన్ని పాటించాలని అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు అందరు కలిసి పని చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు,

ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ,పోతుల అన్నవరం,అడపా ప్రసాద్, ముత్యాల ఆంజనేయులు, మద్దాల మణికుమార్,వాడపల్లి సుబ్బరాజు, వర్తనపల్లి కాశి, పరిమి సురేష్, పసుమర్తి సత్యనారాయణ, కరటూరి గోవిందు,బేతిన గిరి, పసుమర్తి రామ్ లక్ష్మణ్, మద్దిపాటి ధర్మేంద్ర, పరిమి సూర్యనారాయణ, ఆలపాటి శేఖర్, బొల్లం రవి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పెంటపల్లి రామాలయానికి 10 లక్షలు శ్రీవాణి ట్రస్టు నిధులు అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం పెన్ పవర్ మార్చి 29:-** మండలం లోని రంప యర్రంపాలెం శివారు పెంటపల్లిలో శ్రీ రామాలయానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధుల నుండి రామాలయం పునర్నిర్మాణానికి పది లక్షల రూపాయల నిధులు అందించినట్లు రామాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ గారబోయిన శ్రీనివాస్ తెలిపారు. ఈ పది లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా జగంపేట లో జరిగిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కందుల చిట్టిబాబు, పీలా మహేష్,గౌరవ అధ్యక్షులు మిర్తిపాటి శ్రీనివాసు, ఆలయ కమిటీ సెక్రటరీ గారబోయిన శివకృష్ణ, కమిటీ సభ్యులు పల్లిబోయిన గంగ బాబు, శీలం రాంబాబు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం చింతూరు లో




**చింతూరు, పెన్ పవర్ మర్చి 28:**చింతూరు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ అధ్యక్షత వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ అమర్రహే అంటూ నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భారీ కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మండల అధ్యక్షులు జమాల్ ఖాన్, నందమూరి తారక రామారావు 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు రెండు రూపాయల కిలో బియ్యం వంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మనసులు గెలుచుకున్న గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి కార్యకర్త నడుచుకొని, ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎండి జహంగీర్, ఓబులనేని రామారావు చౌదరి, ఇళ్ల చిన్నారెడ్డి, ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి మల్లెల్లి వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు మంగవేణి, సీనియర్ నాయకులు ఆకోజు నూకాచారి, క్లస్టర్ ఇంచార్జ్ ఓ నరసింహారావు, పొదిలి రామారావు, ముత్యాల శ్రీరామ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు తుర్రం ముత్తయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు పి. సాల్మన్ రాజు, మాజీ సర్పంచ్ సోడే శ్రీనివాసరావు, ఎండి రియాజ్, కట్ట శంకర్, జాఫర్, బీజేపీ నాయకులు బట్ట లక్ష్మణ్, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.


# మత్స్య సంపద వృద్ధికి కృషి చేయాలి :ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 29:** ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని,మత్స్య సంపద వృద్ధి చెందేందుకు మత్స్యకారులు కృషి చేయాలని, తద్వారా వారి ఆదాయం పెంచుకోవాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం, పెదతాడేపల్లి గ్రామం, పెద్దచెరువులో చేపల పెంపకం నిమిత్తం ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా చేపపిల్లలను వదిలారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా 40 శాతం రాయితీపై చేప పిల్లలను మత్స్యకార సహకార సంఘాలకు అందజేస్తారని అన్నారు. ఇవి కొంత పెరిగిన తర్వాత మత్స్యకార సంఘాలకు చెందిన చెరువులకు పంపిణీ చేస్తారని తెలిపారు. మత్స్యకార కుటుంబాల జీవనోపాధి నిమిత్తం,వారి ఆదాయాన్ని పెంచే విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలియజేశారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని మత్స్య సంపద పెంచాలని అన్నారు. పి.ఏం. ఎస్.ఎస్.వై. పథకం ద్వారా మత్స్యకారుల జీవనోపాధికి, కుటుంబ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో మత్స్యకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో సుమారు 1000 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని, వారందరికీ న్యాయం చేస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నోరున్న వాళ్ళదే రాజ్యం అన్నట్టుగా, మత్స్యకార సంఘాలకు కూడా తెలియకుండా వ్యవహరించారని విమర్శించారు. మత్స్యకార సంఘాలకు ప్రభుత్వం అందించే రాయితీలు,ఇతర సౌకర్యాలు దుర్వినియోగం కాకుండా, పారదర్శకంగా, ప్రతి ఒక్కరికి అందే విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. మత్స్యకార సంఘాల ప్రతినిధులు కోరిన విధంగా చెరువుల పూడిక తీసేందుకుకు చర్యలు చేపడతామన్నారు.ఆయా గ్రామాల్లో చెరువుల అభివృద్ధికి, పూడిక తవ్వటానికి పంచాయతీ తీర్మానాల ద్వారా పనులు చేపట్టాలని అన్నారు.కొందరు అభివృద్ధి నిరోధకులు అడ్డుపడుతుంటారని, అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గతంలో చెరువు తవ్వాలన్నా, ఏ పని చేయాలన్నా ఎమ్మెల్యేకి లంచం ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు అలాంటి దౌర్భాగ్య పరిస్థితి లేదన్నారు. వచ్చిన ఆదాయాన్ని ఆయా గ్రామాల అభివృద్ధికి కేటాయించే విధంగా, నిజాయితీగా పనిచేస్తున్నామన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా, అభివృద్ధి చేయంగా తాము ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మరణించిన మత్స్యకారులకు 10 లక్షలు పరిహారం ఇచ్చే విధంగా పవన్ కళ్యాణ్ హామీ నెరవేర్చారన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితమని, ఈ ఐదు సంవత్సరాలు కేవలం అభివృద్ధి మాత్రమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. కూటమిలో మూడు పార్టీలు బలంగా ఉండాలని, ఎవరూ అనవసర వ్యాఖ్యానాలు చేయవద్దని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ అనుభవం రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుందని, ప్రజల మేలు కోసం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి అందరూ బాసటగా నిలవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ,పోతుల అన్నవరం, అడపా ప్రసాద్, ముత్యాల ఆంజనేయులు, మద్దాల మణికుమార్,వాడపల్లి సుబ్బరాజు, వర్తనపల్లి కాశి, పరిమి సురేష్, పసుమర్తి సత్యనారాయణ, కరటూరి గోవిందు, బేతిన గిరి, పసుమర్తి రామ్ లక్ష్మణ్, మద్దిపాటి ధర్మేంద్ర, ఆలపాటి శేఖర్, తదితరులు పాల్గొన్నారు మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘాల నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**150 మందికి వైద్య సేవలు**


**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 29 :**రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, రాజమండ్రి ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం మండలం సిరిగిందలపాడులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ తెలిపారు.

ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 150 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు ఆయన వెల్లడించారు. శిబిరంలో డాక్టర్ పోతుల రామారావు, డాక్టర్ దాసరి ఉమా మహేష్, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ శ్రీనివాస్ రాయుడు, డాక్టర్ రాజేష్ ఖన్నా తదితర వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన చికిత్స అందించారు.రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 61 మందికి రక్తపరీక్షలు, 9 మందికి థైరాయిడ్ పరీక్షలు, 5 మందికి ఈసీజీలు, 5 మందికి ఎక్స్-రేలు, 8 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు స్వామీజీ వివరించారు.అలాగే శిబిరానికి హాజరైన రోగులు మరియు సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్య సేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ ఆత్మగౌరవానికి ప్రతీక







**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,మార్చి 29 :**తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ భాగస్వామ్యం కల్పించిన పార్టీ అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు.రంపచోడవరం ఎన్టీఆర్ కూడలిలో ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కార్యక్రమంలో పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ1982 మార్చి 29న స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగువారికి సముచిత స్థానం కల్పించేందుకు తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. చైతన్య రథయాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో రాజకీయ చైతన్యం నింపి, కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చిన అరుదైన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు.ఎన్టీఆర్ పాలనలో ప్రవేశపెట్టిన రూ.2 కిలో బియ్యం పథకం, మహిళలకు ఆస్తి హక్కులు, మండల వ్యవస్థ, గురుకుల పాఠశాలలు, విద్యుత్ రాయితీలు, పక్కా గృహాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు.తదుపరి తరంలో నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సాంకేతికతకు ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దారని, ఈ-గవర్నెన్స్, డ్వాక్రా సంఘాలు, రైతు బజార్లు వంటి కార్యక్రమాలతో పాలనను ప్రజలకు చేరువ చేశారని కొనియాడారు. మూడవ తరం నాయకత్వంలో నారా లోకేష్ యువతలో చైతన్యం నింపుతూ పార్టీని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు.కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను ఈ సందర్భంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనగణన డేటా సేకరణ పకడ్బందీగా చేపట్టాలి

✷ డి ఆర్వో టి సీతారామ మూర్తి




**రాజమహేంద్రవరం పెన్ పవర్. మార్చి 29:**జిల్లాలో నిర్వహించనున్న 2027 గృహ జనగణన డేటా సేకరణను పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అనుసరించి గృహ, జనగణన డేటా సేకరణలో క్షేత్ర శిక్షకులు ప్రధాన పాత్ర పోషించాలని విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.ఆదివారం స్థానిక ఆర్ఎంసీ సమావేశ మందిరంలో 2027 గృహ జనగణన డేటా సేకరణకు సంబంధించి ఫీల్డ్ ట్రైనర్లకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ టి. సీతారామ మూర్తి మాట్లాడుతూ, భారతదేశంలో తొలిసారిగా గృహ జనగణన ప్రక్రియను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో నిర్వహించడం కీలక మార్పు అని తెలిపారు.

డిజిటల్ విధానం కీలకమన్నారు. మార్చి 23 నుంచి 25 వరకు కొవ్వూరు డివిజన్ వారికి మార్చి 26 నుంచి 28 వరకు రాజమహేంద్రవరం డివిజన్ల పరిధిలో వారికి మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న ఫీల్డ్ ట్రైనర్లకు పలు సూచనలు, సలహాలు అందించామన్నారు. తమ పరిధిలోని మండలాలు, మున్సిపాలిటీల్లో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు క్షేత్రస్థాయిలో సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు.

పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన, నాణ్యమైన సమాచారాన్ని సేకరించడం అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలుగా హౌసింగ్ పిడి నాతి బుజ్జి, డీఈఆర్ఎంసీ డి. రామకిషోర్ పాల్గొన్నారు. సెన్సస్ అధికారులుగా సెంట్రల్ సెన్సస్ అధికారి అశ్విన్ బిజాపై, సెన్సస్ అధికారి సిహెచ్ శ్రీనివాస్, కలెక్టరేట్ సిబ్బంది, ఫీల్డ్ ట్రైనర్లు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన రెపరెపలాడిన తెలుగుదేశం జెండాలి






**గోకవరం పెన్ పవర్ మార్చి 29:**-తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గ్రామ గ్రామాన టిడిపి పార్టీ అధ్యక్షుల చేతుల మీదుగా పార్టీ జెండాను ఎగరవేశారు. నాయకులు, కార్యకర్తలు సంతోషంతో కేకులుకట్ చేసి,స్వీట్లు పంచారు.స్థానిక శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ కన్వీనర్ లు జెండా ఆవిష్కరించారు. గ్రామ పార్టీ పార్టీ అధ్యక్షులు గోకవరంలో పైలా శ్రీనివాసరావు, కృష్ణుని పాలెంలో కొంగరపు రాజు, తంటికొండలో నాగం వెంకటపతి, గాదెలపాలెంలోనాగేశ్వరరావు ఇటుకాయలపల్లిలో పిల్లి కనకరాజు, అచ్చుతాపురంలో కోలా ఏసుబాబు,గుమ్మళ్ళ దొడ్డిలో ఏగి సత్తిబాబు,వెదురుపాకలో గొర్రెల శ్రీనివాస్, రంప ఎర్రంపాలెంలో సత్యం పెద్దబ్బులు, తిరుమలయపాలెంలో కోడూరి సత్తిబాబు, గంగంపాలెంలో నూకరాజు , కొత్తపల్లిలో దిండి రాజు , కామరాజుపేటలో కటారి అంజనీ కుమార్, మల్లవరంలో గొర్రెపల్లి శ్రీను చేతుల మీదుగా టిడిపి పార్టీ జెండాను ఎగరవేయడం జరిగింది. తెలుగువాడి సత్తా ఢిల్లీకి చాటిచెప్పిన ఘనత టిడిపి పార్టీకే చెందుతుందని పలువురు టిడిపి నాయకులు అన్నారు. కూడు, గూడు,గుడ్డ నినాదంతో సంక్షేమాన్ని దేశానికే పరిచయం చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని గర్వంగా తెలిపారు. భావితరాల భవిష్యత్తు కోసం టిడిపి ఎప్పుడూ ముందుంటుందని నాయకులు తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# గంగవరం మండలంలో ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**గంగవరం, పెన్ పవర్ మార్చి 29 :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం మొల్లేరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొల్లేరు పి.ఏ.సి.ఎస్ చైర్మన్ పాము అర్జున ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీకి విశేష సేవలు అందించిన సీనియర్ నాయకులను పూలదండలు, సాలువాలతో ఘనంగా సన్మానించారు.అలాగే గంగవరం మండలం జడేరు లో మండల కమిటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు కార్యదర్శి కనిగిరి రాంబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తోందన్నారు.ప్రస్తుత నాయకత్వంలో నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లు ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## 120 కుటుంబాలకు నష్టపరిహారం జాప్యం రంగంలోకి దిగిన రమణారెడ్డి (చిట్టి బాబు)

- మిగిలిన నష్టపరిహారం కోసం పోలవరం బాధితులు ఎదురుచూపులు
- బిజెపి నాయకుడు డివిఎస్ రమణారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు



**చింతూరు పెన్ పవర్ మార్చి 29 :**పోలవరం ప్రాజెక్ట్ పరిధిలోని చింతూరు యూనిట్‌కు చెందిన బాధితులు మిగిలిన ఇళ్ల నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. సుమారు 120 కుటుంబాలకు ఇప్పటికీ నష్టపరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతుండటంపై బాధితులకు న్యాయం జరగడం లేదని బిజెపి నాయకుడు డివిఎస్ రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చింతూరుకు వచ్చిన పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను కలిసిన రమణారెడ్డి, ఈ అంశంపై లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. నష్టపరిహారం చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యాన్ని వెంటనే పరిష్కరించి, పోలవరం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందని రమణారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా స్పెషలిస్టు వైద్యులు లేకపోవడంతో నాలుగు మండలాలకు చెందిన రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టీబి, కుష్టు వంటి వ్యాధులకు సంబంధించిన నిపుణులను తక్షణమే నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. పోలవరం బాధితులకు న్యాయం చేయడం తో పాటు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని డివిఎస్ రమణారెడ్డి డిమాండ్ చేశారు.

## ఘనంగా టిడిపిపార్టీ.44వ.ఆవిర్భావ దినోత్సవం

-టిడిపిపార్టీ మండలనాయకులు కార్యకర్తలు






**వి.ఆర్.పురం పెన్.పవర్.మార్చి.29:**తెలుగుదేశం పార్టీ సీనియర్,నాయకులు మాజీ జెడ్పిటిసి ముత్యాలరామారావు కుమారుడు,ముత్యాల వెంకట సాయి సిద్ధార్థ ఈనెల21వ.తారీకున అకాలమృతి చెంద డం జరిగింది.పార్టీకొరకు కష్టపడి పనిచేసే యువనాయకు డును కోల్పోయామంటూ సిద్ధార్థ (సిద్ధు)ఆత్మకు శాంతి కలగాలని,టిడిపిపార్టీ మండలనాయకులు కార్యకర్తలు రెండు నిమిషాలు మౌనం పాటించి,నివాళులర్పించడం జరిగింది.అనంతరం మండలంలోని రేఖపల్లి ఎన్టీఆర్, విగ్రహంవద్ద ఆదివారం టిడిపి పార్టీ మండలనాయకులు ఆధ్వర్యంలోటిడిపిపార్టీ జెండాను ఆవిష్కరించి,ఘనంగా టిడిపిపార్టీ.44 ఆవిర్భావ దినోత్సవం జరపుకున్నారు. మండల పరిదిలోని పదకొండుపంచాయతీలలో కార్య కర్తలుఆధ్వర్యంలో టిడిపిపార్టీజెండాను ఆవిష్కరించారు. 33వ.వసంతాలు పూర్తి చేసుకొని 44వ.వసంతంలోకి అడుగు పెట్టుతున్నతరణంలో టిడిపిపార్టీమండల సీని యర్, నాయకులకు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.ఈసందర్భంగా టిడిపిపార్టీమండల అధ్యక్షులు బొర్రానరేష్,కుమార్,మాట్లాడుతూ1982 లో నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించి,తొమ్మిది నెలలోనే అధికారాన్ని జయించి,పేద ప్రజల కోసం రెండు రూపాయలు కిలో బియ్యం వృద్ధాప్య పెన్షన్ మహిళకు సమాన వాటా రాష్ట్రంలోని మండల వ్యవస్థ పంచాయతీ వ్యవస్థ తీసుకొచ్చి పేద ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన,నాయకుడు మన స్వర్గీయ నందమూరి రామా రావు అన్నారు.మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు పేద ప్రజల కోసం ఎన్నో కార్య క్రమాలు పెట్టి 70 రూపాయలు ఉన్న పెన్షన్ ఈరోజు నాలుగువేల రూపాయలకు తీసుకువచ్చిన నాయకుడు మన చంద్ర బాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలు పెట్టి పేద ప్రజల గుండెల్లో నిలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజల కోసం సూపర్ సిక్స్ పథకాలు పెట్టి వృద్ధులకు పెన్షన్ మహిళలకుఈ ఫ్రీ బస్సు నిరుద్యోగులకు మెగా డీఎస్సీ మహిళకు వంట గ్యాస్ ఫ్రీ అన్నదాత సుఖీభవ అనేక సంక్షేమ పదకాలు అమలు చేశారని,కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాయం రామారావు,టిడిపిపార్టీ సీనియర్, నాయకులు బొర్రా నరసింహారావు,టిడిపిపార్టీ మాజీ అధ్యక్షులుఆచంట శ్రీనివాసరావు,జెడ్పిటిసి వాళ్ళరంగా రెడ్డి,ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వరరెడ్డి,సీనియర్,నాయకులు ముత్యాల రమేష్,మామిడి రాజు,రేవు శివ,సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య, మాజీ సొసైటీ చైర్మన్ ముత్యాల చంద్ర శేఖర్,మాజీ సర్పంచ్ వాళ్ళ కోటేశ్వర్ రెడ్డి,రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవలం రాజేంద్ర ప్రసాద్,వాణిజ్య విభాగ అధ్య క్షులు బీరక సూర్యప్రకాష్,రావు, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు పులి సాహెబ్,మండల బీసీ సెల్ అధ్యక్షులు కోట్ల శ్రీనివాస్,మండల రైతు విభాగ అధ్యక్షులు నాలా రపు సత్యనారాయణ,సీనియర్ నాయకులు దుర్గా రావు,కృపారావు,బింగి విష్ణు,బేరి వెంకన్న,శిఖండిరాజు, పేట బూత్ కన్వీనర్ ముత్యాలభాను,తిరుపతిరావు, నాయ కులు కార్యకర్తలు తదితరులు పాల్గొ న్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం







**చింతూరు పెన్ పవర్ మార్చి 29:**చింతూరు మండలంలో విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 30వ నెంబర్ జాతీయ రహదారిపై బొడ్డుగూడెం సమీపంలో బొలెరో వాహనం కల్వర్ట్‌ను ఢీకొని లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
వాహనంలో మొత్తం 13 మంది ఉన్నట్టు సమాచారం. గాయపడిన వారిని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# క్రికెట్ బెట్టింగ్ పై అత్యాశకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దు



జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ మీనా

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 29:** ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైన నేపథ్యంలో, జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన యువతను, తల్లిదండ్రులను ఉద్దేశించి పలు కీలక సూచనలు చేశారు.
జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ నిర్వాహకులపై, ఆన్‌లైన్ బుకీలపై ప్రత్యేక పోలీస్ బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా లేదా పాల్గొన్నా ఏపీ జూద చట్టం (ఇూా +ుఎఅఅస్త్ర-ూాెమ్) ఏపి గ్యామింగ్ యాక్టు ప్రకారం కఠిన కేసులు నమోదు చేస్తామన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడకండి. శ్రమించకుండా వచ్చే సొమ్ము శాశ్వతం కాదు, అది మీ భవిష్యత్తును అంధకారం చేస్తుందని తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలి. స్మార్ట్ ఫోన్‌లలో వారు ఏ యాప్స్ వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనేది గమనిస్తూ ఉండాలన్నారు. క్రికెట్ ఒక వినోదం మాత్రమే. దానిని జూదంగా మార్చి మీ కుటుంబాలను వీధిన పడేయకండి. ఒక్క తప్పుడు అడుగు మీ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల కలలను చిన్నాభిన్నం చేస్తుందని రాహుల్ మీనా, జిల్లా ఎస్పీ సూచించారు.
బాల్-టు-బాల్ బెట్టింగ్, ఆకర్షణీయమైన ఆఫర్ల వెనుక పెద్ద మోసం దాగి ఉంటుంది. బెట్టింగ్ వల్ల అప్పుల పాలు కావడమే కాకుండా, సామాజికంగా గౌరవం కోల్పోవాల్సి వస్తుందన్నారు.
మీ పరిసరాల్లో ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100/112 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం: తాళ్లూరు ఆత్మీయ సమావేశంలో వక్తల పిలుపు





**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 29:** గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో నిర్వహించిన బీసీ కులాల ఆత్మీయ సమావేశం బీసీల చైతన్యానికి వేదికగా నిలిచింది. 13 బీసీ కులాల ప్రతినిధులు, యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో పంపన రామకృష్ణ,పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి,ఒమ్మి రఘు రామ్, వైసీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం అబ్జార్వర్
.కుండల సాయి, బీజేపీ, దీజ జాతీయ ఉపాధ్యక్షులు
.పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, తెలుగు జనతా పార్టీ వ్యవస్థాపకులు, శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు
.వియ్యపు అప్పలస్వామి, బిసి సంక్షేమ సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు
.బాలాజీ శంకర సింగ్, బొందులీల రాష్ట్ర అధ్యక్షులు,
పంచికట్ల రామకృష్ణ యాదవ్, దీజ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు , తదితర

వక్తలు పాల్గొనగా ముందుగా జ్యోతిరావు పూలే గ్రహానికి పూలుమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీల సామాజిక, రాజకీయ భవిష్యత్తుపై దిశానిర్దేశం చేశారు. ప్రపంచంలో ఉన్న కుల, మత వివక్షలను పోగొట్టగలిగే ఏకైక ఆయుధం విద్య మాత్రమేనని, పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులను చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఒక ఐఏఎస్, ఐపిఎస్ అధికారి అయితే ఎవరైనా సరే సెల్యూట్ కొట్టాల్సిందేనని, ఆ స్థాయికి మన బిడ్డలు ఎదగాలని ఆకాంక్షించారు.
ఓటు హక్కు వినియోగం: రాజ్యాంగం కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని సరైన సమయంలో, సరైన విధంగా ఉపయోగించుకోకపోవడమే బీసీల వెనుకబాటుతనానికి ప్రధాన కారణమని విశ్లేషించారు. మన హక్కుల కోసం ప్రశ్నించే చైతన్యం మనలో రావాలని కోరారు.
ఐక్యత లేకపోవడం బీసీలు సంఖ్యాపరంగా బలంగా ఉన్నప్పటికీ.. పార్టీలు, ప్రాంతాలు, కులాల వారీగా విడిపోవడం వల్ల రాజకీయంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. “ఇంట్లో ఉన్నప్పుడే కులం.. బయటకు వస్తే మనమందరం బీసీలం“ అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు.
నాయకత్వాన్ని, రిజర్వేషన్ల ద్వారా కేవలం ప్రతినిధులు మాత్రమే కాకుండా, నిజమైన నాయకులు తయారవ్వాలని వక్తలు అభిప్రాయపడ్డారు. మనలో ఎవరైనా నాయకుడిగా ఎదుగుతుంటే, ఆర్థికంగా వెనుకబడిన వారికి తోటి బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ, మహిళా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. 1979లో మండల కమిషన్ సిఫార్సుల వల్లే నేడు బీసీలకు ఈమాత్రం రాజకీయ ప్రాధాన్యత దక్కుతోందని గుర్తు చేశారు. ఈ సమావేశం సందర్భంగా ప్రతి గ్రామంలో 13 కులాలతో కూడిన ఒక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు బీసీలను చైతన్యపరచాలని నిర్ణయించారు. రాబోయే రెండు మూడు నెలల్లో భారీ ఎత్తున జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.
బీసీల సంక్షేమం కోసం, హక్కుల పోరాటం కోసం ఈ ఐక్య వేదిక నిరంతరం కొనసాగాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం ముఖ్య అతిథులను దుశ్యాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో బీసీ సంఘ నాయకులతో పాటు తాళ్లూరు గ్రామంలో బీసీల మహిళలు , పురుషులు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ సూపర్ రికార్డ్..

# ఎవరికి అందనంత ఎత్తులో..







**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అనేక రికార్డులు సృష్టించిన ఫ్రాంచైజీలలో ముంబై ఇండియన్స్ జట్టు మరో అరుదైన ఘనతని సాధించే దిశగా దూసుకుపోతోంది. గత 18 సీజన్లలో ఇప్పటి వరకు ముంబై టీమ్ మొత్తం 299 టీ20 మ్యాచ్‌లు ఆడుతూ, ఈ జాబితాలో నెంబర్ వన్ స్థానంలో కొనసాగుతుంది. ప్రస్తుతం జరుగుతున్న సీజన్‌లోనే 300 మ్యాచ్‌ల మైలురాయిని చేరే తొలి జట్టుగా హార్దిక్ పాండ్యా సేన నిలవడం ఖాయంగా కనిపిస్తుంది. కాగా ఐపీఎల్ లో అత్యధిక మ్యాచులు ఆడిన ఈ జాబితాలో ముంబై ఇండియన్స్ తర్వాత మరిన్నీ జట్లు కూడా ఉన్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్స్ సైతం అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఫ్రాంచైజీల జాబితాలో కొనసాగుతున్నాయి.

**అత్యధిక టీ20 మ్యాచ్‌లు ఆడిన జట్లు:**

ముంబై ఇండియన్స్ - 299
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - 287
కోల్‌కతా నైట్ రైడర్స్ - 281
చెన్నై సూపర్ కింగ్స్ - 277
ఢిల్లీ క్యాపిటల్స్ - 274

**విజయాల శాతంలో ముంబై దూకుడు:**

300 టీ20 మ్యాచ్‌లు ఆడిన మొట్ట మొదటి ఫ్రాంచైజీ జట్టుగా నిలవనుండటంతో పాటు ఐపీఎల్ జట్లలో చెన్నై సూపర్ కింగ్స్ 56.67 విజయాల

శాతం తర్వాత ముంబై 54.18 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం, ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ రెండూ చెరో ఐదు ఐపీఎల్ ట్రోఫీలతో పాటు రెండు సీఎల్‌టీ20 ట్రోఫీలతో గెలుచుకుని సమంగా ఉన్నాయి. 2020లో చివరిసారిగా ట్రోఫీని గెలుచుకున్న ఈ టీమ్స్, 19 ఎడిషన్ లో 6వ ఐపీఎల్ ట్రోఫీపై కన్నేశాయి.

# ముంబై-కేకేఆర్ మ్యాచ్ లో టాస్ పై అనుమానాలు... నెటిజన్ల ఆగ్రహం

- ముంబై-కోల్‌కతా మ్యాచ్‌లో టాస్ సమయంలో వివాదం
- కాయిన్ కిందపడిన దృశ్యం చూపించకుండానే ముంబై గెలిచినట్లు ప్రకటన
- ప్రసార లోపంపై సోషల్ మీడియాలో అభిమానుల తీవ్ర ఆగ్రహం
- బ్రాడ్‌కాస్టర్, ముంబై యాజమాన్యం ఒకటే కావడంతో ఇలా జరిగిందంటూ ఫ్యాన్స్ అనుమానాలు
- ముందు బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 220 పరుగుల భారీ స్కోరు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో మరో వివాదం రాజుకుంది. వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్ (ఎంఐ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కెకెఆర్) మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రసారంలో సాంకేతిక లోపం కారణంగా టాస్ ఫలితం స్పష్టంగా కనిపించకపోవడంతో, ముంబైకి అనుకూలంగా నిర్ణయం వెలువడిందని అభిమానులు సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, ఈ మ్యాచ్‌లో ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ కోసం నాణేన్ని గాల్లోకి ఎగరేశాడు. కోల్‌కతా కెప్టెన్ అజింక్యా రహానే 'టెయిల్స్' అని కాల్ చేశాడు. అయితే, నాణెం కింద పడిన సమయంలో మ్యాచ్ రెఫరీ దానిని తీసుకోబోతుండగా, కెమెరా యాంగిల్ ఒక్కసారిగా మారిపోయింది. దీంతో నాణెం హెడ్ పడిందా లేక టెయిల్ పడిందా అనే విషయం ప్రేక్షకులకు కనిపించలేదు. వెంటనే ముంబై ఇండియన్స్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నట్లు ప్రకటించడం వివాదానికి దారితీసింది. ఈ ఘటనపై అభిమానులు తీవ్రంగా స్పందించారు. "హార్దిక్ టాస్ వేశాడు, కానీ ఫలితం చూడలేదు. అయినా ముంబై గెలిచింది. ఇలాంటి అద్భుతాలు ముంబైకే సాధ్యం" అంటూ ఓ నెటిజన్ ట్వీట్ చేశాడు. మరోవైపు, "ఐపీఎల్ ప్రసార హక్కులున్న సంస్థ (జియో హాట్ స్టార్), ముంబై ఇండియన్స్ యాజమాన్యం (రిలయన్స్) ఒకటే కావడం వల్ల ఇలాంటి అనుమానాలు వస్తున్నాయి" అంటూ మరికొందరు పరస్పర విరుద్ధ ప్రయోజనాల కోణాన్ని ప్రస్తావిస్తూ ఆరోపణలు చేశారు. కాగా, ఈ వివాదంపై ఆటగాళ్లు గానీ, అంపైర్లు గానీ అధికారికంగా స్పందించలేదు. అయినప్పటికీ, సీజన్ ఆరంభంలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం పట్ల నెటిజన్లు మండిపడుతున్నారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే (67), అంక్రిష్ రఘువంశి (51) అర్ధశతకాలతో రాణించారు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ మూడు వికెట్లు పడగొట్టాడు.

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఫాలోవర్స్ తగ్గిపోతారు..


# సెహ్వాగ్, అశ్విన్ మధ్య ఇంట్రెస్టింగ్ డిస్కషన్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(RCB) వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్(SRH) మధ్య జరిగిన తొలి మ్యాచ్ సందర్భంగా భారత మాజీ క్రికెటర్లు డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్, స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మధ్య సరదా సంభాషణ జరిగింది. ఈ మ్యాచ్‌తో హిందీ కామెంటేటర్‌గా అశ్విన్ ఎంట్రీ ఇచ్చాడు. కొత్తగా హిందీ కామెంట్రీ ప్యానెల్‌లో చేరిన అశ్విన్‌కు సీనియర్‌గా సెహ్వాగ్ కొన్ని కీలకమైన సూచనలు జారీ చేశాడు. ఈ రోజు మనం లాజిక్, ఆలోచనతో కాకుండా మనసుతో మాట్లాడుదాం అంటూ వీరేంద్ర సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. వెంటనే అశ్విన్ మాట్లాడుతూ.. 'మా అమ్మనాన్నలు ఏదైనా మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని, ఆలోచించకుండా ఏదీ అనొద్దని నేర్పించారు.. మీరు మాత్రం దానికి విరుద్ధంగా చెబుతున్నారని తెలిపారు. దానికి సెహ్వాగ్ తనదైన శైలిలో రిప్లై ఇచ్చి నవ్వులు పూయించాడు. అయితే అశ్విన్‌కు యూట్యూబ్ ఛానెల్ ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. అదిరిపోయే ఆన్సర్ ఇచ్చాడు. కొందరు వ్యక్తులు కావాలనే ఆలోచించి మాట్లాడుతారు.. వారు ఏమనుకుంటారంటే.. 'ఈ ఆటగాడికి ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు.. నేను గనుక అతని గురించి నెగటివ్‌గా మాట్లాడితే.. నా ఫాలోవర్లు తగ్గిపోతారు.. అదే పాజిటివ్‌గా మాట్లాడితే.. నా ఫాలోవర్లు మరింత పెరుగుతారని అనుకుంటారని వీరేంద్రుడు చెప్పాడు. దీంతో అక్కడ నవ్వులు చిందించారు. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ సమష్టి ప్రదర్శనతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 201 రన్స్ చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్(80) హాఫ్ సెంచరీతో రాణించగా, అనికేత్ వర్మ, క్లాసెన్ మెరుపులతో ఎస్ఆర్ హెచ్ భారీ స్కోర్ చేసింది. అనంతరం టార్గెట్ ఛేదించేందుకు దిగిన ఆర్సీబీ కేవలం 15.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసి ఈజీగా విజయం సాధించింది. దేవదత్ పడిక్కల్(61), విరాట్ కోహ్లీ(69లి) హాఫ్ సెంచరీలతో ఈ గెలుపులో కీలక పాత్ర పోషించారు.



# 'సర్దార్ 2' తెలివైన పని..అంచనాలు పీక్స్ లో!



ప్రస్తుతం భారతీయ చిత్ర పరిశ్రమలో స్పై థ్రిల్లర్ సినిమాల హవా నడుస్తోంది. -ధురంధర్- రిలీజ్ అయిన దగ్గర నుంచి -ధురంధర్ 2- రిలీజ్ పై ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసారు. ఈ మధ్య కాలంలో ఏ సినిమా రిలీజ్ కోసం ప్రేక్షకులు అంతగా ఎదురు చూసింది లేదు. -ధురంధర్- రిలీజ్ పైనే సర్వత్రా చర్చ జరిగింది. ఆ రకంగా ధురంధర్ అనే స్పై సినిమా ప్రేక్షకుల్లో ఎంత బలమైన ప్రభావాన్ని చూపించిదన్నది అంచనా వేయోచ్చు. ఇటీవలే రిలీజ్‌అయిన -ధురంధర్ ది రివేజ్- ఎంత పెద్ద విజయాన్ని నమోదు చేసిందో తెలిసిందే. దీంతో స్పై సినిమాల గ్రాఫ్ అంతకంతకు మార్కెట్ లో పెరిగింది.

ఒకప్పుడు స్పై సినిమాలంటే కేవలం బాలీవుడ్ మార్కెట్ కే పరిమితమయ్యేవి. కానీ నేడు సీన్ మారింది. పాన్ ఇండియాలో స్పై కథకు ప్రేక్షకులకు అంతే కనెక్ట్ అవుతున్నారు. -ధురంధర్ 2- 1000 కోట్ల క్లబ్ లో వారం వ్యవధిలో చేరడమే అందుకు ఉదాహరణ. గూఢచారి వ్యవస్థ, దేశభక్తి ,హై-వోల్టేజ్ యాక్షన్ అంశాలకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ సానుకూల వాతావరణం ఇప్పుడు కోలీవుడ్ స్టార్ కార్తీ నటిస్తోన్న -సర్దార్ 2- చిత్రానికి కొండంత అండగా నిలవబోతోంది. ఇది నిజంగా చిత్ర యూనిట్ తీసుకున్న అత్యంత తెలివైన నిర్ణయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో -సర్దార్- మొదటి భాగం విడుదలైనప్పుడు తమిళంలో మంచి విజయం సాధించినప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. అప్పట్లో స్పై సినిమాలపై ప్రేక్షకులకు ఉన్న అవగాహన , ఆసక్తి పరిమితంగా ఉండటమే అందుకు కారణం. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. -ధురందర్- సిరీస్ తర్వాత స్పై స్టోరీలలోని లోతును, ఆ ఉత్కంఠను తెలుగు జనాలు బాగా ఓన్ చేసుకుంటున్నారు. ఈ క్రేజ్ -సర్దార్ 2- అంచనాలను అప్పుడే పీక్స్‌కు తీసుకెళ్లింది. దర్శకుడు పి.ఎస్. మిత్రన్ -సర్దార్ 2-ను మొదటి భాగం కంటే రెట్టింపు బడ్జెట్ భారీ యాక్షన్ సన్నివేశాలతో తెరకెక్కిస్తున్నారు. -గూఢచారి-గా కార్తీ పర్ఫార్మెన్స్ ఈసారి మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని సమాచారం. -ధురందర్ 2- విజయం అందించిన ఊపుతో? తెలుగు పంపిణీదారులు కూడా -సర్దార్ 2- రైట్స్ కోసం భారీగా పోటీ పడుతున్నట్లు సమాచారం. స్పై జోనర్‌కు ఇప్పుడున్న డిమాండ్‌ను బట్టి చూస్తే? ఈ సినిమాకు తెలుగులో భారీ ఓపెనింగ్స్ రావడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే కొన్నాళ్ల పాటు సినిమా ఇండస్ట్రీలో స్పై సినిమాల హవానే నడుస్తుంది. ప్రేక్షకులు ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు , అంతర్జాతీయ కుట్రల నేపథ్యంలో సాగే కథలను ఇష్టపడుతున్నారు. ఐరన్ వేడిగా ఉన్నప్పుడే దెబ్బ కొట్టాలన్న సామెతలా స్పై సినిమాల ఫీవర్ పీక్స్‌లో ఉన్నప్పుడే ఈ జానర్ చిత్రాలను చేసి కాసులు చేసుకోవచ్చు.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965